నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 19 మే 2025 | MEDAK

# నేటికాలంలో చదువు ఎంతో అవసరం



విద్యార్థికి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- నీలకంఠ సమాజం సేవలు ఆదర్శం
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 18: చదువుతో ఏమైనా సాధించవచ్చని, నేటికాలంలో చదువుకోవడం ఎంతో అవసరమని, విద్య ఉద్యోగం కోసమే కాదు దేశం, సమాజం పట్ల మన బాధ్యతను పెంచుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని గౌరీ నీలకంఠేశ్వర ఆలయ 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చదువు లేకపోతే జీవితానికి అర్థం లేదన్నారు. అందరి ఐక్యతతో ఆలయాన్ని దినదినాభివృద్ధి చేస్తూ నీలకంఠ సమాజం ఎంతో ఆదర్శంగా నిలిచిందన్నారు. కర్రతో చేసిన రథం అద్భుతంగా ఉందన్నారు. రథం గురించి ఏర్పాటు చేసిన భవనం నేడు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. నీలకంఠ సమాజం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ టాపర్లకు ఆయన పురస్కారాలు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సాహించాలన్నారు. రథాన్ని అద్భుతంగా తయారు చేసిన శిల్పిని హరీశ్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, నీలకంఠ సమాజం అధ్యక్షుడు గుండ్ల యోగేశ్వర్, సమాజం సభ్యులు కడవేర్గు నర్సింలు, లోక లక్ష్మీరాజ్యం, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 3 నుంచి అమర్‌నాథ్‌లో అన్నప్రసాదం

- కరపత్రాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



అమర్‌నాథ్ అన్నప్రసాద కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, మే 18: సిద్దిపేట ఆధ్యాత్మిక, ధార్మిక సామాజిక సేవలకు నెలవుగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జూలై 3 నుంచి అమర్‌నాథ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆదివారం సిద్దిపేటలో అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన ప్రసాద వితరణ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 14 ఏండ్లుగా అమర్‌నాథ్‌లో సిద్దిపేట అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ఇలానే కొనసాగాలన్నారు. అందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.

# కాంగ్రెస్ పాలనలో మిషన్ భగీరథ నిర్వీర్యం

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి



అబ్బెంద వద్ద పైప్‌లైన్ లీకేజీ వల్ల వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

నారాయణఖేడ్, మే 18: ప్రజల దాహార్తి తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యం అవుతున్నదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామానికి వెళ్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ నీరు వృథా పోతుండటాన్ని గమనించి స్థానికులతో మాట్లాడారు. వారం రోజులుగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథా అవుతున్నాయని స్థానికులు ఆయనకు తెలిపారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో నీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో నెల రోజులుగా డిప్యూటీ ఈఈ స్థానం ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ లేక నిర్వహణ పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చోద్యం చూస్తున్న ఎమ్మెల్యే, అధికారులకు ప్రజా సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టడంతో పాటు గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని భూపాల్‌రెడ్డి కోరారు.

# అడ్డగోలుగా.. చేపల చెరువులు

## వట్‌పల్లి మండలంలో అనుమతుల్లేకుండా చేపల చెరువులు ఏర్పాటు



సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లో చేపల చెరువులో మేతగా వేసిన కుళ్లిపోయిన బాయిలర్ కోళ్ల వ్యర్థాలు

- 100 ఎకరాలకు పైనే అక్రమంగా చేపల చెరువుల నిర్మాణం
- అధికార పార్టీ నాయకుల అండదండలు
- చూసీచూడనట్లుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- మిషన్ భగీరథ నీరు పంపింగ్ సమీపంలోనే ఏర్పాటు
- తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం
- మూగజీవాలకు నీరు కరువు.. రైతులకు ఇబ్బందులు

వట్‌పల్లి, మే 18: అధికారం ఉందనే ధీమా... అధికారులు తాము చెప్పినట్లు వింటారనే నమ్మకం... మంత్రి నియోజకవర్గం ఇంకేముంది. గల్లీ లీడర్ మొదలుకొని మండల స్థాయి లీడర్ వరకు తామే మంత్రి అనే లెవల్లో అధికారులను నయానో భయానో మచ్చిక చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా సింగూరు బ్యాక్‌వాటర్ స్థలాల్లో, వ్యవసాయ, ప్రభుత్వ భూముల్లో చేపల చెరువులు ఏర్పాటు చేయిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్, దేవునూర్, పాలడుగు, భూత్కూర్, గొర్రెకల్, దరఖాస్తుపల్లి, ఉసిరికపల్లి, నిర్జప్ల గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అధికార పార్టీ నాయకుల అండతో కొందరు ఇష్టారాజ్యంగా చేపల చెరువులు ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నారు. అక్రమ చేపల చెరువుల దందా మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతున్నది. వట్‌పల్లి మండలంలో సుమారు 100 ఎకరాలకు పైనే అధికారుల అనుమతి లేకుండా చేపల చెరువులు ఏర్పాటు చేశారు. సింగూరు బ్యాక్‌వాటర్ పక్కన ఉన్న ముంపు భూములు తమవేనంటూ పరిహారం పొందిన రైతులు చేపల పెంపకందారులకు లీజుకు ఇస్తున్నారు. గతంలో సింగూరు, మంజీరా డ్యామ్‌ల నిర్మాణంలో ముంపునకు గురైన భూములకు సంబంధించి ప్రభుత్వం అప్పట్లో బాధిత రైతులకు పరిహారం ఇచ్చింది. అయినా ఆ రైతుల ఏటా రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు డబ్బులు తీసుకుని చేపల చెరువుల ఏర్పాటుకు ముంపు భూములిస్తున్నారు. చేపల చెరువుల పెంపకందారులు మంజీరా నది నుంచి కాలువలు ఏర్పాటు చేసుకొని మోటర్ల సహాయంతో చేపల చెరువులను నీటితో నింపుతున్నారు. చేపల పెంపకం సులువుగా ఉండడంతో పాటు తక్కువ సమయంలో చేప పిల్లల ఎదుగుదల, అధిక లాభాలు ఉంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు ఇక్కడ చేపల చెరువుల నిర్మాణం చేపడుతున్నారు.



వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లో మంజీరా బ్యాక్‌వాటర్ తీసేందుకు బిగించిన మోటర్లు



### బాయిలర్ కోళ్ల వ్యర్థాలే ఆహారం..

తక్కువ పెట్టుబడితో వచ్చే బ్రాయిలర్ కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా పెడుతున్నారు. బాయిలర్ కోళ్ల వ్యర్థాలు చేపలకు అందించడం కోసం వాహనాల్లో తరలించే సమయంలో గ్రామాల ప్రజలు, చుట్టుపక్కల వ్యవసాయం చేసుకునే రైతులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటాంటి సంఘటనలు సంబంధిత అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. పాడైన, కుళ్లిన కోళ్ల వ్యర్థాలు ఆహారంగా పెడుతూ చేపలను పెంచుతున్నారు. ఇలా పెరిగిన చేపలు తింటే ఎన్నో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం విశేషం. చేపల చెరువులోకి కావాల్సిన నీటికోసం మంజీరా డ్యామ్ బ్యాక్ వాటర్ నుంచి కాలువలు ఏర్పాటు చేసి, చెరువు వద్దకు నీటిని తెచ్చి పెద్ద పెద్ద మోటర్లతో నీటితో నింపుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ అధికారులు చేపల చెరువుల మోటర్లకు ఏకంగా విద్యుత్ సరఫరా చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వ అధికారులే అక్రమ దందాలకు సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. చేపల చెరువులన్నీ సింగూరు బ్యాక్‌వాటర్ సమీపంలో ఏర్పాటు చేయడంతో మూగ జీవాలకు నీటి కొరత ఏర్పడుతున్నది. మిషన్ భగీరథ గ్రిడ్‌కు సమీపంలోనే చేపల చెరువులు ఏర్పాటు చేశారు. ప్రజలకు అందించే మిషన్ భగీరథ తాగునీరు కలుషితమై అనారోగ్యాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం అక్రమంగా ఏర్పాటు చేసిన చేపల చెరువులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పాత భవనంలో.. భయంభయంగా..

## శిథిలావస్థకు చేరిన సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

- కొత్తది పూర్తయిన ప్రారంభానికి జాప్యం
- ఎలక్ట్రిక్, ప్రహరీ పనులు పూర్తిచేస్తే అందుబాటులోకి
- ప్రారంభించాలని కోరుతున్న రోగులు, వైద్యసిబ్బంది



కొత్త భవనం నిర్మాణానికి బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం



సిర్గాపూర్‌లో నిర్మించిన పీహెచ్‌సీ నూతన భవనం



సిర్గాపూర్‌లో పాత భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ

సిర్గాపూర్, మే 18: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిల భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నది. ఈ పురాతన భవనంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడుతున్నాయి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి చొరవ చూపి పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. స్థానిక పీహెచ్‌సీ భవనం సముదాయంలోని ఖాళీ స్థలంలో అధునాతన సౌకర్యాలతో నూతన భవనం నిర్మించేందుకు ప్రాతిపాదించి 15వ ఫైనాన్స్ కింద రూ. 1.56 కోట్లు మంజూరు చేయించారు. అనంతరం 2023 జనవరి 2న అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తి చేసి కొత్త భవనానికి శ్రీకారం చుట్టారు. భవన సముదాయాన్ని పూర్తిగా నిర్మాణం చేపట్టారు. అయితే భవనంలో కొన్ని పనులు పెండింగ్‌లో మిగిలాయి. ఎలక్ట్రిక్, కంపౌండ్ నిర్మాణం, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో కొద్దిపాటి పనులు పూర్తికాక భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదని తెలిసింది.

**శిథిల భవనంలో భయం గుప్పిట్లో విధులు**

సిర్గాపూర్‌లో ఐదు దశాబ్దాల కితం నిర్మించిన పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరింది. భవనానికి అక్కడక్కడ పెచ్చులూడుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఈ పురాతన భవనానికి మూడేండ్ల క్రితం మరమ్మతులు చేశారు. పెయింటింగ్ చేయించారు. అయినా పాత భవనంలో భయం గుప్పిట్లో వైద్యసిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనంలో పూర్తి స్థాయిలో వైద్యసేవల సౌకర్యాలు, ప్రసవ గది, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ల్యాబ్ గదులు, లేబర్ గది తదితర సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జరిగిన భూభారతి సదస్సుకు వచ్చిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి స్థానికులు పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభించాలని విన్నవించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నూతన భవనాన్ని త్వరితగతిన ప్రారంభించాలని వైద్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

# ఆదమరిస్తే అంతే

- ప్రమాదరకంగా మారిన రోడ్డు
- ఒకవైపు బావి.. మరోవైపు వాగు
- ప్రయాణం.. నరకప్రాయం
- ఇబ్బందులో ప్రయాణికులు, వాహనదారులు



ప్రమాదకరంగా మనూరు వాగు రోడ్డు

మనూరు, మే 18: మాయికోడ్-మనూరు మధ్యన వాగు వెంట ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మనూరు మండల కేంద్రానికి వెళ్లాలంటే పలు గ్రామాల ప్రజలు ఈ వాగుపక్కన ఉన్న రోడ్డు నుంచే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. మనూరు మండలంలోని మాయికోడ్, రాణాపూర్, తుమ్నూర్, ముగ్ధుంపూర్, దుదగొండ, బోరంచ, దన్వార్, ఉసిరికెపల్లి, రాయిపల్లి గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఒకవైపు బావి, మరోవైపు వాగు ఉండడంతో ప్రయాణం కత్తిమీద సాములా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం వర్షాకాలంలో మరింత ఇబ్బందులు తప్పేలా లేవు. వాగు దగ్గర వేసిన సీసీ రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో వర్షాకాలం ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాగులో పడే ప్రమాదం పొంచి ఉంది. జూన్‌లో పాఠశాలలు తిరిగి ప్రారంభం కానుండడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు. రోడ్డు సరిగ్గా లేక అనేక గ్రామాలకు బస్సుసౌకర్యం లేకుండా పోయింది. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# నర్సరీ.. లక్ష్యం నీరుగారి!

## దుబ్బాక బల్దియాలో తూతూమంత్రంగా నర్సరీల నిర్వహణ

- మొక్కల పెంపకానికి రూ.30 లక్షలు ఖర్చు
- సిబ్బంది నిర్లక్ష్యంతో ఎండిపోయిన మొక్కలు
- ఇటీవల మహిళా సంఘాలకు నర్సరీల నిర్వహణ అప్పగింత



సిద్దిపేట జిల్లా దుబ్బాక శివారులో మొక్కలు లేక మైదానంలా మారిన నర్సరీ

దుబ్బాక, మే 18: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో రెండెకరాల స్థలంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురవుతున్నది. దుబ్బాక పట్టణంలో మొక్కలు నాటేందుకు ఈ నర్సరీలో పలు రకాల మొక్కల పెంపకం చేపట్టారు. విడతల వారీగా నర్సరీ నిర్వహణకు మున్సిపల్ నుంచి రూ.30 లక్షలు వెచ్చించి మొక్కలు పెంపకం చేపట్టారు. నర్సరీ నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయి. నర్సరీలో మొక్కల సంరక్షణతో పాటు వాటికి నీరందించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. కొంతకాలంగా నర్సరీలో మొక్కలకు సరైన నీరందించక పోవడంతో మొక్కలు ఎండిపోయి నిర్జీవంగా మారాయి. దుబ్బాక పట్టణంలో నర్సరీ నిర్వహణలో మున్సిపల్‌కు ఇబ్బందులు తలెత్తడంతో ఇటీవల వాటి నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించారు. వన మహోత్సవానికి సుమారు 50 వేలకుపైగా మొక్కలు అవసరం ఉండగా, తగినన్ని మొక్కల పెంపకం చేపట్టడం లేదు. ముందస్తు ప్రణాళిక లేక పోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. వన మహోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అధికార యంత్రాంగం సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



దుబ్బాక నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

### మహిళా సంఘాలకు అప్పగించాం..

దుబ్బాక పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోయాయి. ఇప్పుడు నర్సరీ నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించాం. దుబ్బాక మున్సిపల్ పరిధిలో 4 నర్సరీలు మహిళా సంఘాలకు అప్పగించాం. చెల్లాపూర్‌లో -2, ధర్మాజీపేట, మల్లాయిపల్లి, చేర్వాపూర్ వార్డులలో ఒక్కోటి చొప్పున మొత్తం 5 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇందులో 25 వేల మొక్కలు పెంచనున్నారు. వివిధ రకాల పండ్లు, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కల పెంపకం కొనసాగుతుంది. ఒక్కో మొక్కకు రూ.10 చొప్పున వారికి చెల్లిస్తాం. మొక్కల పెంపకం ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం సమకూరుతుంది. – శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక మున్సిపల్ కమిసనర్

# సంగారెడ్డిలో ఆపరేషన్ ఘోస్ట్

## గొల్లపల్లిలో అస్సాం వాసి మోఫిజుల్ ఇస్లాం అరెస్టు

- సైబర్ క్రైమ్‌తో పాటు పాకిస్థాన్ హ్యాండర్లకు దేశభద్రత సమాచారం చేరవేసిన ఇస్లాం
- అదుపులోకి తీసుకున్న అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ఇస్లాం నుంచి సిమ్‌కార్డులు స్వాధీనం
- అప్రమత్తమైన సంగారెడ్డి జిల్లా పోలీసులు



మోఫిజుల్ ఇస్లాం

కొండాపూర్, మే 18: ఆపరేషన్ ఘోస్ట్‌లో భాగంగా అస్సాంకు చెందిన మోఫిజుల్ ఇస్లాం(19) అనే వ్యక్తిని అస్కాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సంగారెడ్డి జిల్లా గొల్లపల్లిలో అరెస్టు చేయడం కలకలం సృష్టించింది. మోఫిజుల్ ఇస్లాం సైబర్ క్రైమ్‌లకు పాల్పడడంతో పాటు దేశభద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు చేరవేస్తున్నట్లు అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇస్లాం నుంచి నకిలీ సిమ్‌కార్డులతో పాటు ఇతర పత్రాలను అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇస్లాంను అరెస్టు చేసిన అనంతరం అతనితో పాటు ఉన్న మరో ఆరుగురు అస్సాం వాసులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారించి కొండాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో సంగారెడ్డి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తుల్లో ఎవరైనా సైబర్ క్రైమ్, దేశభద్రతకు సంబంధించిన సమాచారం శత్రుదేశాలకు చేరవేస్తున్నారా అనేక కోణంలో గోప్యంగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. అస్సాం పోలీసులు, జిల్లా పోలీసుల వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన మోఫిజుల్ ఇస్లాం తమ స్వగ్రామంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసేవాడు. సెల్‌ఫోన్ దుకాణంలో ఉంటూ మోఫిజుల్ ఇస్లాం అక్రమంగా పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు ఉపయోగించేలా అస్సాం సిమ్‌కార్డులు అమ్ముతున్నాడు. పాకిస్థాన్ చెందిన వ్యక్తులు భారత్‌కు చెందిన సిమ్‌కార్డులు ఉపయోగించేలా వారికి ఓటీపీ నెంబర్లు చేరవేయడంతో పాటు దేశభద్రతకు సంబంధించిన సమాచారం వారితో పంచుకున్నట్లు సమాచారం. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అస్సాం రాష్ట్రంలోని పలువురు దేశ భద్రతకు విఘాతం వాటిల్లేలా, ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతోపాటు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు సమాచారం చేరవేస్తున్నట్లు మిలటరీ ఇంటలిజెన్స్ గుర్తించి అస్సాం రాష్ట్ర పోలీసులకు సమాచారం అందజేసింది. దీంతో అప్రమత్తమైన అస్సాం పోలీసులు కొద్దిరోజులుగా ఆపరేషన్ ఘోస్టు పేరుతో అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తులపై నిఘా వేసి సైబర్ క్రైమ్ నేరాలతో పాటు దేశభద్రతకు సంబంధించిన సమాచారం పాకిస్థాన్ హ్యాండర్లకు చేరవేస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నారు. సైబర్ క్రైమ్ రాకెట్‌తో సంబంధాలు ఉన్న అస్సాం రాష్ట్రంతో పాటు రాజస్థాన్, తెలంగాణలో ఉన్న వారిని అస్సాం టాస్క్‌ఫోర్సు పోలీసులు శనివారం అరెస్టులు చేశారు. ఇందులో భాగంగా అస్సాం నుంచి వచ్చి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఉంటున్న మోఫిజుల్ ఇస్లాంను టాస్క్‌ఫోర్సు పోలీసుల అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. గొల్లపల్లి సమీపంలో కుటుంబ సభ్యులతో ఉంటున్న మోఫిజుల్ ఇస్లాంను ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. ఇస్లాంతో పాటు అతని కుటుంబ సభ్యులను విచారించారు. మోఫిజుల్ ఇస్లాం అక్రమంగా సిమ్‌కార్డులు అమ్మడంతో పాటు పాకిస్థాన్ హ్యాండర్లకు దేశభద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం చేరవేసినట్లు అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్ధారించుకుని అరెస్టు చేసి తమ వెంట తీసుకెళ్లారు. మోఫిజుల్ ఇస్లాం వద్ద నుంచి నకిలీ సిమ్‌కార్డులను పెద్ద సంఖ్యలో అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మోఫిజుల్ ఇస్లాంతో పాటు గొల్లపల్లిలోని ఓ బీరు కంపెనీలో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన ఏడుగురు వ్యక్తులను అస్సాం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారించారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కొండాపూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. అస్సాం రాష్ట్రంలో అక్రమంగా సిమ్‌కార్డులు విక్రయించటంతోపాటు సైబర్‌క్రైమ్‌లకు పాల్పడుతున్నట్లు స్థానిక పోలీసులు గుర్తించటంతో అప్రమత్తమైన మోఫిజుల్ ఇస్లాం అక్కడి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు సంగారెడ్డి జిల్లాలోని గొల్లపల్లికి వచ్చినట్లు తెలిసింది. మోఫిజుల్ ఇస్లాం పదిరోజుల క్రితం గొల్లపల్లి వచ్చి బీరు కంపెనీలో అస్సాంకు చెందిన కార్మికులతో కలిసి గోదాం నిర్మాణంలో కార్మికునిగా పనిచేస్తున్నట్లు సమాచారం.